సాక్షి తిరుపతి

బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



సామాన్య భక్తులకు పెద్దపీట

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తామని దేవదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ స్పష్టం చేశారు. - 8లో



సమస్యల పరిష్కారానికే నిరాహార దీక్ష

అసంఘటితంగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి నిరాహార దీక్ష చేపట్టినట్టు రైల్వే కార్మికులు పేర్కొన్నారు. - 8లో



వైభవంగా ధ్వజారోహణం

చంద్రగిరిలోని కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

మహిళా వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఉమ



తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఉమను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె 40 ఏళ్లపాటు బోధన, పరిశోధన రంగాల్లో పనిచేశారు. జాతీయ, అంతర్జాతీయ పబ్లికేషన్‌తో పాటు స్టేట్ బెస్ట్ టీచర్‌గా ప్రశంసలు పొందారు. మహిళా వర్సిటీకి రెక్టార్‌గా, ఇన్‌చార్జి వీసీగా పని చేసిన ఆమెకు వర్సిటీ పాలనపై అవగాహన ఉంది. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా వీసీగా కొనసాగుతున్న ఆమె బుధవారం పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధకారితే లక్ష్యంగా వర్సిటీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని చెప్పారు.

భూసేకరణ పనులు వేగవంతం



మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: అధికారులు సమన్వయంతో భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన మంగళవారం భూసేకరణపై అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రధానంగా రెవెన్యూ, జాతీయ రహదారులకు చెందిన అధికారులు సమష్టిగా భూసేకరణలో పురోగతి చూపాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారులతోపాటు రైల్వే ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలన్నారు. భూసేకరణలో ప్రధానంగా గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఆయా మండల తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. కడప–రేణిగుంట, తిరుపతి–మదనపల్లి , రేణిగుంట–నాయుడుపేట ఆరు లేన్ల రహదారుల నిర్మాణం, తిరుపతి బైపాస్ పనులు, రేణిగుంట నుంచి చెన్నైకి వెళ్లే నాలుగు లేన్ల రహదారి పనులు వేగవంతం చేయాలని వివరించారు. ఏపీఐఐసీ జెడ్ఎం విజయ్‌భరత్ రెడ్డి, నేషనల్ హైవే పీడీలు తిరుపతి వెంకటేష్, నెల్లూరు ఎంకే చౌదరి, చెన్నై రవీంద్రరావు, డెప్యూటీ తహసీల్దార్ భాస్కర్ పాల్గొన్నారు.

అట్టహాసంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు



మూషిక వాహనం పై ఊరేగుతూ..

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిలుతున్న శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కార్య నిర్వహణాధికారి లత ఆధ్వర్యంలో తొలిరోజు గ్రామ దేవత పొన్నెమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయన్ నేతృత్వంలో అర్చక బృందం ఉదయం 7.30 గంటలకు గ్రామ దేవత పొన్నెమ్మకు అభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. సాయంత్రం నాలుగు గంటలకు వాస్తు శాంతి జరిపారు. రాత్రి పొన్నెమ్మ ఉత్సవమూర్తిని మూషిక వాహనంపై మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర నీరాజనాలు అర్పించారు.

జిలకర మసారీ!

జిల్లాలో వరి రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. పెట్టుబడుల భారం పెరగడం, దిగుబడి అంతంతమాత్రంగా ఉండడం, పండించిన ధాన్యానికీ గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పుల కుప్పల్లో మునిగితేలుతున్నారు. ముఖ్యంగా మిల్లర్లు, దళారులు సిండికేట్‌గా ఏర్పడి జిలకర మసూరీ రకానికి ధర తగ్గించేశారు. గత ఏడాది 75 కిలోల బస్తా రూ.2,200 పలకగా.. ఈ సారి రూ.1,600కు పడిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. పెట్టుబడీ చేతికందక.. చేసిన అప్పులు తీర్చలేక అష్టకష్టాలు అనుభవించాల్సి వస్తోందని వాపోతున్నారు.



తడ మండలం, చేనిగుంటవద్ద ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు

జిలకర మసూరీ రకానికి మద్దతు ధర కరువు

- మిల్లర్లు, దళారులతో అవస్థల దరువు
- ధరల్లేకుండా చేస్తున్న సిండికేట్లు
- పెట్టుబడులూ రాక అన్నదాతల అగచాట్లు

సూళ్లూరుపేట: జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఈ రబీ సీజన్‌లో 2.10 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. పండుగలు, పండుగ తర్వాత కురిసిన వానలతో పంట దిగుబడి తగ్గిపోయింది. దీనికి తోడు మిల్లర్లు, దళారులు సిండికేట్‌గా ఏర్పడి ధాన్యం రేట్లు తగ్గించేశారు. సాధారణ రకాలు ప్రస్తుతం రూ.1,500 నుంచి రూ.1,700 పలుకుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో బస్తా ధాన్యం రూ.2,200 దాకా పలికింది. ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఆలస్యం చేస్తే రైతులే తగ్గించి ఇస్తారనే ఆలోచనతో మిల్లర్లు నాటకాలాడుతున్నారు.

ధాన్యానికి, బియ్యానికి తేడా ఇలా..

రైతుల వద్ద తరుగు కింద బస్తాకు 80 కిలోలు లాగేసుకుంటున్నారు. దీనికి రైతులకు ఇచ్చేది ప్రస్తుతం రూ.1,600 నుంచి రూ.1,700 మాత్రమే. ఈ 80 కిలోల బస్తాను బియ్యంగా మిల్లులో ఆడిస్తే సుమారు 40 నుంచి 45 కిలోల బియ్యం వస్తాయి. 6 కిలోలు నూకలు, 20 కిలోల తవుడు, 2 కిలోలు పొట్టు వస్తుంది. 45 కిలోల బియ్యం ధర రూ.2,925, 6 కిలోలు నూకల రూ.240, 20 కిలోల తవుడురూ.700, రెండు కిలోల పొట్టు రూ.80 మొత్తం రూ.3,945 వరకు గిట్టుబాటు అవుతోంది.

అరకొర ధర

జిల్లాలో ఈనెల మొదటి వారం నుంచి వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కానీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను కంటితుడుపు చర్యగా ఏర్పాటు చేసింది. ఎంటీయూ–1010, ఎన్ఎల్ఆర్–145, ఆర్ఎన్ఆర్ఎం–7, ఎన్ఎల్ఆర్ 34449, బీపీటీ–5240, ఎన్ఎల్ఆర్–33358, ఎన్ఎల్ఆర్ 33057 ధాన్యానికి గ్రేడ్–ఏ రకం క్వింటాల్ రూ.2,320 మద్దతు ధర ప్రకటించింది. అలాగే ఎంటీయూ–1001, సీఆర్–1009, ఎన్ఎల్ఆర్–34242, ఏడీటీ–37, ఎన్ఎల్ఆర్–286000 రకాలను సాధారణ రకాలుగా గుర్తించి క్వింటాల్ రూ.2,300 మద్దతు ధర ప్రకటించారు. నెమ్ము కింద ఒక కేజీ, గోనె సంచె కింద మరో కేజీ, తరుగు కింద ఇంకో రెండు కిలోల చొప్పున తీసేసి బస్తాకి 79 కిలోలు చొప్పున ధాన్యం సేకరిస్తున్నారు. అదేదో మిల్లర్లకే ఇచ్చేస్తే అక్కడికక్కడే డబ్బులు ఇస్తారనే ఉద్దేశంతో సన్నచిన్న కారు రైతులు కళ్లాల్లోనే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. పెద్ద రైతులుగా ఉన్న వారు వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో స్టాక్ చేసుకుంటున్నారు.

ఆ హక్కు రైతుకు లేదా?

కష్ట నష్టాలకోర్చి పండించే ధాన్యానికి ఎంఆర్‌పీ నిర్ణయించే హక్కు రైతులకు లేకుండా పోయింది. అదే మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసి బియ్యంగా మార్చి దానికి ఏదో ఒక పేరుపెట్టి ఎంఆర్‌పీ నిర్ణయించే హక్కు ఉంది. అంటే ఇక్కడ కష్టపడి వస్తువును తయారు చేసేవారికన్నా కష్టపడకుండా మోసం చేసేవారికే ధర నిర్ణయించే హక్కు ఉండడం గమనార్హం.

బియ్యం ధరలు ఇలా

గత ఏడాది సన్న రకాల బియ్యం రూ.1,150 నుంచి రూ.1,250 దాకా పలికాయి. ఈ నెలలో అమాంతంగా అదే రకాలు రూ.1350 నుంచి రూ.1,550 దాకా పెంచేశారు. ఇంకా కొన్ని బ్రాండ్లకు సంబంధించిన బియ్యాన్ని రూ.1,600 దాకా విక్రయిస్తున్నారు. బస్తా 25 కిలోలు ఉందని చెబుతున్నారు. కానీ తూకం వేస్తే 23 లేకపోతే 24 కిలోలు వస్తున్నాయి. అదేమని నిలదీస్తే మిల్లుల్లోనే అలా వస్తున్నాయని బియ్యం వ్యాపారులు సమాధానం ఇస్తున్నారు. ప్రస్తుతమున్న ధరల ప్రకారం తీసుకుంటే కిలో బియ్యం సరాసరిన రూ.65 దాకా ఉంది. ఈ లెక్కన 24 కిలోలు, 23 కిలోలున్న బియ్యం బస్తాకి అదనంగా మరో రూ.65 నుంచి రూ.130 దాకా వినియోగదారులు నష్టపోవాల్సిన పరిస్థితి దాపురించింది.

ధాన్యానికి రేట్లు ఎందుకివ్వరు?



మార్కెట్లో కిలోబియ్యం రూ.65కు అమ్ముతున్నారు. అదే ధాన్యానికి వచ్చేసరికి ధరలు ఎందుకు తగ్గిస్తున్నారు. కష్టనష్టాలెదుర్కొని పండించే ధాన్యానికి రేట్లు నిర్ణయించుకునే హక్కులేదు. అదే మా వద్ద ధాన్యం కొనుగోలు చేసి బియ్యంగా మార్చుకుని అమ్మేవారికి మాత్రం రేట్లు నిర్ణయించుకునే హక్కుంది. ఇదెక్కడి న్యాయం. **– చెంగేజి సుధాకర్, రైతు, తదఖండ్రిగ, తడ మండలం**



తడ మండలం, కొండూరు వద్ద హైవే మీద ధాన్యం ఆరబెట్టిన రైతులు



కళ్లాల్లోనే ధాన్యాన్ని అమ్మేస్తున్న రైతులు

జిల్లాలో వర్షపాతం వివరాలు


గత ఏడాది సాధారణ వర్షపాతం
1,124.3 కాగా **1,071.4** మి.మీ

ఈ ఏడాది సాధారణ వర్షపాతం
1,049.7 కాగా **1,315.5** మి.మీ

జిల్లాలో వరి సాగు వివరాలు

వరి రకం	శాతం
బీపీటీ 5240	55
ఎంటీయూ 1010	10
ఎంటీయూ 1001	10
మిగిలిన రకాలు	25

ఎకరా సాగుకు రూ.35 వేల పెట్టుబడి



ఎకరా వరి సాగుకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి అవుతోంది. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో దిగుబడి ఆశాజనకంగా లేదు. దీంతో ఎకరానికి 20 నుంచి 30 బస్తాల్లోపు దిగుబడి వచ్చింది. ఆ ధాన్యానికి కూడా మద్దతు ధర లేకపోవడంతో వచ్చిన మొత్తం పెట్టుబడికే సరిపోయింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు లేకపోవడంతో అప్పుల పాలు కావాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.
– సుంకర అల్లెయ్య, రైతు, నాదెళ్లవారికండ్రి

నష్టాలే దిగుబడి



పంట పరవాలేదనిపించినా రేట్లు లేకపోవడంతో పెట్టుబడులకు కూడా చాలకుండా పోయింది. ధాన్యాన్ని మాత్రం అత్యంత చీప్‌గా అడుగుతున్నారు. మరి బియ్యం రేట్లు ఎందుకు తగ్గించడం లేదు. రైతులు పండించిన ధాన్యానికి మాత్రం రేట్లు లేకుండా చేస్తున్నారు. నిల్వ చేసుకోవడానికి షెడ్లు లేకపోవడంతో ఒకటికి సగానికి విక్రయించాల్సి వస్తోంది.
– లొక్కు రమణయ్య, రైతు దేగావారికండ్రిగ

రెవెన్యూకు హైకోర్టు అక్షింతలు



గిరిజనులు సాగు చేసుకుంటున్న నిమ్మ తోటలు



జారీ అయిన హైకోర్టు ఉత్తర్వులు

సైదాపురం: రెవెన్యూ అధికారులకు హైకోర్టు అక్షింతలు వేసింది. రైతులు సాగు చేసుకుంటున్న భూములపై ఇప్పటికిప్పుడు ఎలాంటి చర్యలు చేపట్టొద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో రైతులు, పేదలు సంతోషం వ్యక్తం చస్తున్నారు. వివరాలు.. మండల కేంద్రమైన సైదాపురంలోని 793 ఏ సర్వే నెంబర్‌లో 114 ఎకరాల భూమి ఉంది. గతంలో ఆ భూమి మైనింగ్ లీజులో ఉండేది. ఈ క్రమంలో గడిచిన కొన్నేళ్లుగా మైనింగ్ లీజు గడువు కూడా ముగిసింది. ఆ భూమి సమీపంలోనే కమ్మవారిపల్లి గ్రామం ఉండడంతో ఆ గ్రామానికి చెందిన ఐదు గిరిజన కుటుంబాలతో పాటు మరో 10 మంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారు ఆ భూములను ఆక్రమించుకున్నారు. ఒక్కో కుటుంబం వారు ఎకరా నుంచి రెండెకరాల వంతున ఆక్రమించుకుని నిమ్మ తోటలను సాగు చేసుకుంటున్నారు.

అధికారుల అత్యుత్సాహం

కూటమి నేతల ప్రోత్సాహంతో రెవెన్యూ అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. పేదలు సాగు చేసుకుంటున్న భూములపై కొరడా ఝుళిపించేందుకు సిద్ధమయ్యారు. దీంతో పేదలు హైకోర్టును ఆశ్రయించారు. తీర్పు వారి వైపే రావడంతో పేదలు సంబరాల్లో మునిగిపోయారు.

మహిళా వర్సిటీకి మరో మణిహారం

- ఖేలో ఇండియా మల్టీ పర్పస్ ఇండోర్ హాల్
- తిరుపతి ఎంపీ కృషితో రూ.4.5 కోట్లతో నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న మంత్రి లోకేష్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ శిగలో మరో మణిహారం చేరింది. ఇండోర్ స్పోర్ట్స్ కోసం మల్టీ పర్పస్ ఇండో హాల్ నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మహిళలు అకడమిక్ విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో ఖేలో ఇండియా స్కీమ్‌లో భాగంగా రూ.5.72 కోట్లతో మల్టీ పర్పస్ ఇండోర్ హాల్ అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంది.



ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న మల్టీ పర్పస్ ఇండోర్ హాల్

తిరుపతి ఎంపీ కృషితోనే!

తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి కృషితో ఖేల్ ఇండియా స్కీమ్ ద్వారా మహిళా వర్సిటీలో మల్టీపర్పస్ ఇండోర్ హాల్ మంజూరైంది. ఇండోర్ హాల్ వర్సిటీలో ఏర్పాటు చేయాలని గతంలో పలుమార్లు వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థినులు ఎంపీకి విన్నవించారు. దీంతో 2021లో కేంద్ర ప్రభుత్వానికి ఇండోర్ హాల్ ఆవశ్యకతను తెలియజేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం రూ.4.50కోట్లు మంజూరు చేసింది.

అత్యాధునిక హంగులు

పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్మించిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో నాలుగు షెటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు, ఒక హ్యాండ్ బాల్ కోర్టు, జిమ్నాస్టిక్ హాల్, టేబుల్ టెన్నిస్ హాల్, జూడో మ్యాట్, వెయిట్ లిఫ్టింగ్ వంటి క్రీడలకు సౌలభ్యంగా భవననిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.4.50 కోట్లు ఉండగా మహిళా వర్సిటీ రూ.1.22 కోట్లు సమకూర్చింది.

నేడు మంత్రి చేతుల మీదుగా ప్రారంభం

మహిళా వర్సిటీలో మల్టీపర్పస్ ఇండోర్ హాల్‌ను బుధవారం విద్యా, ఐటీ శాఖ మంత్రి నారాలోకేష్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే వర్సిటీలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఇండోర్ హాల్ వద్ద సుందరీకరణ పనులను మంగళవారం అధికారులు శరవేగంగా పూర్తిచేశారు.

● గరుడ వాహనంపై చిద్విలాసం



బంగారు గరుడ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు



స్వాతి నక్షత్రం సందర్భంగా శాంతిహోమం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి చందనాలంకరణలో అభయమిచ్చారు. మంగళవారం స్వాతి నక్షత్రం శ్రీవారి జన్మనక్షత్రం కావడంతో స్వామివారి మూల మూర్తికి చందనంతో అలంకరించినట్లు అర్చకులు తెలిపారు. సాయంత్రం శ్రీవారికి అత్యంత ప్రియమైన బంగారు గరుడ వాహనంపై లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీర్చి మేళతాళాల నడుమ కోన మాడవీధుల్లో ఊరేగించారు.

ఆలయాల బలోపేతమే లక్ష్యం

● అంతర్జాతీయ ఆలయాల సదస్సులో వక్తలు

తిరుపతి మంగళం: ఆలయాల భద్రత, బలోపేతమే లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. తిరుపతి మంగళంలోని ఆశాకన్వెన్షన్ హాలులో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఆలయాల సదస్సు, ప్రదర్శన (ఐటీసీఎక్స్–2025) కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన మంగళవారం ఆలయాల ప్రతినిధులతోపాటు, ఏపీ, తెలంగాణ, తమిళనాడు కర్ణాటక, కేరళ రాష్ట్రాల గ్రామీణ ఆలయాల నిర్వాహకులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఐటీసీఎక్స్ వ్యవస్థాపకుడు గిరీష్ వాసుదేవ్ కులకర్ణి ఆధ్వర్యంలో షిర్డీ సాయి సంస్థాన్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ వహిద్ వెలింగ్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్, డెవలెప్మెంట్, రీసెర్చ్ డైరెక్టర్ ఉదయ్ పలుంభేతో నిర్వహించిన ప్యానెల్ డిస్కషన్ ఆలోచింపజేసింది. షిర్డీసాయి టెంపుల్ నిర్వహణ, చారిటీపై షిర్డీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ చైర్‌పర్సన్ అంజూషెండే, సీఈవో గోరక్ష్ గాడిల్కర్ ఆధ్వర్యంలో చర్చ నిర్వహించారు.





మాట్లాడుతున్న తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై, టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి

ప్రభుత్వాల పాత్రపై అవగాహన

కోవిలూరు మఠానికి చెందిన నారాయణదేశికస్వామి ఆధ్వర్యంలో సమాజాభివృద్ధికి దేవాలయాల ద్వారా అనుసరించాల్సిన పద్ధతులు, ఆలయాల నిర్వహణలో ప్రభుత్వాల పాత్రను వివరించారు. కర్ణాటక ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ఆర్పీ.రవిశంకర్, అఖిల భారత శ్రీవాసవి పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ పీఎస్.గోవిందరాజులు ఆధ్వర్యంలో ది జర్నీ ఆఫ్ వారణాసి టెంపుల్స్ అనే అంశంపై అవగాహన కల్పించారు. దాతలు జె.శేఖర్‌రెడ్డి, దొర స్వామిలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



సదస్సుకు హాజరైన వివిధ ఆలయాల ప్రతినిధులు

ఆకట్టుకున్న స్టాళ్లు

సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 60 స్టాళ్లు సందర్శకును విశేషంగా ఆకట్టుకున్నాయి. సదస్సులో ఏర్పాటు చేసిన వివిధ ఆలయాల దేవుళ్ల విగ్రహాలు, కలంకారి చిత్రాలు, శారీలు, గోల్డ్ కాయిన్స్, డ్రోన్ల ద్వారా మంటలను అదుపు చేయడం తదితరాలు మంత్రముగ్దులను చేశాయి.



సదస్సులో ఆకట్టుకుంటున్న వివిధ రకాల స్టాల్స్



ఆకట్టుకున్న వాయిద్య నృత్యాలు

ఆలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి

తిరుపతి సిటీ: దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాల్సిన అవసరం ఉందని తమిళనాడు బీజేపీ చీఫ్ కే అన్నామలై పేర్కొన్నారు. మంగళవారం జరిగిన ఐటీసీ ఎక్స్‌పోలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశీయ, అంతర్జాతీయ ఆలయాలకు చెందిన వివిధ తరాల సనాతన ధర్మ సంరక్షకులను, పరిచర్యులను ఒకే వేదిక మీదకు చేర్చడం శుభపరిణామమన్నారు. తమిళనాడులో బీజేపీ అధికారం చేపట్టగానే 44,121 ఆలయాలకు హెచ్ ఆర్ అండ్ సీఈ యాక్ట్ నుంచి విముక్తి కలిగిస్తామని మ్యానిఫెస్టోలో పెట్టినట్టు గుర్తుచేశారు.

త్వరలో అత్యున్నత ధార్మిక సంస్థ

రాష్ట్రంలోని హిందూ దేవాలయాలను ప్రోత్సహించి ధార్మిక దానధర్మాలను సులభతరం చేయడం, సమన్వయం, నియంత్రించడం కోసం రాష్ట్ర రాజ్యధార్మిక పరిషత్‌లో అత్యున్నత సంస్థను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు విశ్వ హిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే చెప్పారు. రాజ్య ధార్మిక పరిషత్‌లో మత నాయకులు తదితరులు ఉంటారని చెప్పారు.

క్లుప్తంగా

సామాన్య భక్తులకు పెద్దపీట



వినయ్‌చంద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి: సామాన్య భక్తులకే పెద్దపీట వేసి, వారు సంతృప్తి చెందేలా దర్శనం కల్పించాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్‌చంద్ అన్నారు. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి, వేదపండితులు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఆయనను ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఈ నెల 21 నుంచి జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయంలోకి భక్తులు ప్రవేశించే క్యూలైన్లు, అలాగే వెలుపలకు వచ్చే క్యూలను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలన్నారు. ఆలయ అధికారులు కృష్ణారెడ్డి, మురళి, లోకేష్, విద్యాసాగర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ధూర్జటి కళాప్రాంగణం సిద్ధం



ధూర్జటి కళాప్రాంగణం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో గాలిగోపురం వెనుక ధూర్జటి కళా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ సారి ధూర్జటి ప్రాంగణంలో లింగోద్భవమూర్తి, కన్నప్ప, శ్రీ–కాళ–హస్తి కళాకృతులను ఏర్పాటు చేస్తున్నారు.

వైభవంగా వెంకన్న ధ్వజారోహణం

- పెద్ద శేష వాహనంపై విహరించిన స్వామివారు



గరుడ పటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్చకులు




విశ్వక్సేనుల సమక్షంలో ధ్వజారోహణ ఘట్టం

చంద్రగిరి: కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

వైభవంగా ధ్వజారోహణం

కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేద పండితులో శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను పూర్తి చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై, గరుడాళ్వార్, చక్రతాళ్వార్‌లు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. తదుపరి మీన లగ్నంలో ఆలయ అర్చకులు, విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ట, రక్షా బంధనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి సమక్షంలో గరుత్మంతుడిని నూతన వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ఎగురవేశారు. ధ్వజారోహణ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జేఈఓ వీరబ్రహ్మం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పెద్దశేష వాహనంపై వైకుంఠనాథుడి అలంకరణలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు



వాహన సేవ ముందు కళాకారుల ప్రదర్శనలు

పెద్ద శేషుడిపై శ్రీనివాసుడి వైభవం

బ్రహ్మోత్సవాల్లో శ్రీవారు స్వయంగా ఊరేగింపులో పాల్గొనే మొదటి ఉత్సవం పెద్ద శేషవాహనం. మంగళవారం రాత్రి కల్యాణ వెంకన్న శ్రీదేవి, భూదేవి సమేత పెద్ద శేష వాహనంపై నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు అయిన బుధవారం ఉదయం స్వామి వారు చిన్న శేష వాహనంపై, సాయంత్రం హంస వాహనంపై ఊరేగనున్నారు.

జూన్ 6 నుంచి భక్త సమ్మేళనం



మాట్లాడుతున్న భక్త సేవా ట్రస్టు చైర్మన్

వాకాడు: మండల కేంద్రమైన వాకాడులో ఈ ఏడాది జూన్ 6, 7, 8 తేదీలలో జాతీయ స్థాయిలో తెలుగు సాయి భక్త సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అంతర్జాతీయ శిరిడీ సాయి భక్త సేవా ట్రస్టు చైర్మన్ ఎస్ఎల్ నరసింహారావు తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక ఆనంద సాయి నిలయాన్ని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల మహారాష్ట్రలోని శిరిడీ గ్రామంలో అంతర్జాతీయ సమ్మేళనం నిర్వహించినట్టు తెలిపారు. అలాగే ఈ ఏడాది జూన్ 6, 7, 8 తారీఖుల్లో జాతీయ స్థాయిలో తెలుగు సాయి భక్త సమ్మేళనం మొదటి సారిగా తిరుపతి జిల్లా వాకాడులో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో పాల్గొనదలచిన భక్తులు ముందుగా 9395163874, 9949327996 నంబర్లకు సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వైస్ ప్రెసిడెంట్ ఎస్ లక్ష్మీ, తిరుపతి జిల్లా కన్వీనర్ కె విజయలక్ష్మి, కో–ఆర్డినేటర్లు సురేష్‌రెడ్డి, కొండయ్య, వెంకటేశ్వర్లు, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు చెరువుల్లోకి చేప పిల్లలు

చిల్లకూరు: మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మత్స్యకార సొసైటీలకు ఉచితంగా అందించే చేపల పిల్లలను బుధవారం చెరువుల్లో వదలడం జరుగుతుందని మత్స్యశాఖాభివృద్ధి అధికారి రఘుబాబు తెలిపారు. మండలంలోని చిల్లకూరు ఎస్టీ సొసైటీ, ముత్యాలపాడు, కడివేడు ఎస్సీ మత్స్యకార సొసైటీల్లో చేప పిల్లలను వదలనున్నట్టు ఆయన వెల్లడించారు. మూడు చెరువుల్లో సుమారు 5 లక్షల చేప పిల్లలను వదులుతామని చెప్పారు.

శాంతి భద్రతలపై సమీక్ష

తిరుపతి అర్బన్: తిరుపతిలోని మంగళం మార్గంలోని ఓ హోటల్లో మంగళవారం దక్షిణాది రాష్ట్రాలకు చెందిన పోలీస్ ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతపై తీసుకోవాల్సిన అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా అంశాలపై సమీక్షించినట్లు సమాచారం. డీజీపీ, ఐజీ, డీఐజీ స్థాయి అధికారుల సమీక్షను నిర్వహించారు.

మేనకూరులో యువకుడి ఆత్మహత్య



ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న అక్కుపల్లి సాయి

నాయుడుపేట టౌన్: మేనకూరు గ్రామంలో నివాసం ఉంటున్న అక్కుపల్లి సాయి(24) మంగళవారం తన ఇంటిలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామానికి చెందిన సాయి ఏడాదిగా మేనకూరులో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ప్రైవేటు పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం డ్యూటీ ముగించుకుని రాత్రి మేనకూరులో ఉన్న ఇంటికి చేరుకున్నాడు. మంగళవారం ఉదయం 10 గంటలు అవుతున్నా సాయి పరిశ్రమ వద్దకు రాలేదు. దీంతో కాంట్రాక్టర్ మేనకూరులో సాయి ఇంటి వద్దకు సిబ్బందిని పంపించారు. తలుపులు తెరవక పోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ బాబి సంఘటన స్థలం వద్దకు చేరుకుని పరిశీలించిగా సాయి ఇంటి లోపల ఫ్యానుకు ఉరేసుకుని ఉండడాన్ని గుర్తించారు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. వారు వచ్చిన తరువాత ఇంటి తలుపును పగలగొట్టి సాయి మృతదేహాన్ని కిందకి దించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. సాయి మృతదేహానికి నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నారావారిపల్లిలో ఉచిత టైలరింగ్ శిక్షణ



శిక్షణార్థులకు టైలరింగ్ మెటీరియల్ అందజేస్తున్న అధికారులు

చంద్రగిరి: నారావారిపల్లిలో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం సంకల్ప్ పథకం ద్వారా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సుమారు 50 మందికి రెండు బ్యాచ్‌ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ రేణుక, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి, ఏపీ ఎస్ఎస్‌డీసీలు హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో స్వర్ణ నారావారిపల్లి అభివృద్ధిలో నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు అవసరమైన మేరకు వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించనున్నట్లు తెలిపారు. నారావారిపల్లె, కందులవారి పల్లె, భీమవరం, శేషాపురంలో ఉన్నటువంటి ఎస్ఎస్‌జీ సభ్యులకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం శిక్షణార్థులకు టైలరింగ్‌కు అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
(రెవెన్యూ సెక్షన్, తిరుపతి)
Roc. No.REV-1-TTD- 47022(32)/61/ 2024, Dt: 13.02.2025

శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయము, తొండమనాడు గ్రామము, శ్రీ కాళహస్తి మండలము, తిరుపతి జిల్లా నందలి తిరుమల తిరుపతి దేవస్థానమునకు చెందిన వ్యవసాయ భూమి విస్తీర్ణము ఎ.0.44 సెంట్లు కలిగిన భూమిని కౌలుకి మూడు (03) సంవత్సరములకు ఫిబ్రవరి-2025 నుండి జనవరి-2027 వరకు ఇవ్వడానికి నిర్ణయించారు. ఆసక్తి యున్నవారి నుండి సీల్డు టెండర్ ఆహ్వానించబడినది. టెండర్ సహిత వేలం తేది: 28.02.2025 @ 11.30 గం.లకు స్థలము: శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తొండమనాడు గ్రామము, శ్రీ కాళహస్తి మండలము, తిరుపతి జిల్లా నందు టెండర్ ఆహ్వానించబడినది. వివరముల కొరకు తిరుమల తిరుపతి దేవస్థానముల అధికారిక వెబ్‌సైట్ https://www.tirumala.org లేదా ఫోన్ నెం.0877-2264246 పై సంప్రదించగలరు.
Roc No:TTD-40021(31)/1/2024-PRO SEC(Adv No.332) Dt: 18.02.2025
కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
(రెవెన్యూ సెక్షన్, తిరుపతి)
Roc. No.REV-1-TTD- 47022(32)/55/ 2024, Dt: 13.02.2025

శ్రీ అలగానుప్పర్ శ్రీకృష్ణ స్వామి దేవాలయము, మన్నెముత్తూర్ గ్రామము, సూళ్ళూరుపేట మండలము, తిరుపతి జిల్లా నందలి వ్యవసాయ భూములు విస్తీర్ణము ఎ.20.84 సెంట్లు కలిగిన భూమిని కౌలుకి మూడు (03) సంవత్సరములకు మార్చి-2025 నుండి ఫిబ్రవరి-2028 వరకు ఇవ్వడానికి నిర్ణయించారు. ఆసక్తి యున్నవారి నుండి సీల్డు టెండర్ ఆహ్వానించబడినది. టెండర్ సహిత వేలం తేది: 05.03.2025 @ 12.00 గం.లకు స్థలము: శ్రీ అలగానుప్పర్ శ్రీకృష్ణ స్వామి దేవాలయము, మన్నెముత్తూర్ గ్రామము, సూళ్ళూరుపేట మండలము, తిరుపతి జిల్లా నందు టెండర్ ఆహ్వానించబడినది. వివరముల కొరకు తిరుమల తిరుపతి దేవస్థానముల అధికారిక వెబ్‌సైట్ https://www.tirumala.org లేదా ఫోన్ నెం.0877-2264246 పై సంప్రదించగలరు.
Roc No:TTD-40021(31)/1/2024-PRO SEC(Adv No.331) Dt: 18.02.2025
కార్యనిర్వహణాధికారి

నక్షా ప్రోగ్రామ్‌తో పక్కా భూ రికార్డులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తిరుపతి తుడా: నక్షా ప్రోగ్రామ్‌తో పక్కాగా భూ రికార్డులు తయారవుతాయని తిరుపతి ఎంపీ ఎం. గురుమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ×నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్‌÷ (నక్షా) సర్వే పై వర్క్‌షాప్‌ను ఆయన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, కమిషనర్ మౌర్యతో కలసి ప్రారంభించి ప్రసంగించారు. నక్షాలో భాగంగా భూములను నిష్పక్షపాతంగా సర్వే చేపట్టాలని సూచించారు. తిరుపతిలో పలు భూ సంబంధిత సమస్యలు ఉన్నాయని, బయటి దేశాలలో మన జిల్లా వాస్తవ్యులు ఉన్నారని వారికి ఒక భరోసా, ఒక నమ్మకం కలగాలంటే సర్వే పక్కాగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ సుబ్రమణ్యం మాట్లాడారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పారదర్శకంగా లోపాలు లేని భూ రికార్డులు తయారయ్యే విధంగా అధికారులు సర్వే చేయాలన్నారు. తిరుపతి మున్సిపాలిటీ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్, ఉప కమిషనర్ అమరయ్య, సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ సర్వేయర్ దేబబ్రత పాలిత్, జిల్లా భూ రికార్డుల అధికారి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటల సమయం

తిరుమల: తిరుమలలో రద్దీ పెరిగింది. టీటీడీ అధికారుల సమాచారం మేరకు శ్రీవారి సర్వదర్శనం సుమారు 12 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. మంగళవారం సాయంత్రానికి 20 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. సోమవారం అర్ధరాత్రి వరకు 60,784 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 25,521 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.29కోట్లుగా అధికారులు తెలిపారు.

ఇంటికి వెళ్లి వస్తానని..అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం
- రోడ్డున పడ్డ భార్య పిల్లలు



క్షతగాత్రులు (ఇన్‌సెట్) మృతి చెందిన మస్తాన్

చిట్టమూరు: పొట్టకూటి కోసం తమిళనాడుకు వెళ్లాడు. అక్కడ పనులు లేక పోవడంతో తిరిగి ఇంటికొచ్చేశాడు. ఆ తర్వాత భార్య, పిల్లలతో కలిసి నాలుగు రోజులుగా అత్తారింట్లో ఉంటున్నాడు. మంగళవారం తన సొంత ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బైక్‌పై బయల్దేరాడు. ఇంతలో మృత్యువు మరో బైక్ రూపంలో ఎదురొచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చిట్టమూరు మండలం, చిల్లమూరు క్రాస్‌లో మంగళవారం చోటు చేసుకుంది. చిట్టమూరు ఎస్ఐ చిన్నబలరామయ్య వివరాల మేరకు.. దొరవారిసత్రం మండలం, కల్లూరు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్(42) అత్తారిల్లు మొలకలపూడి గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి మోటారు సైకిల్‌పై బయల్దేరాడు. చిల్లమూరు క్రాస్ రోడ్డు వద్ద అదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, రాజయ్య మోటార్ సైకిల్‌పై ఎదురుగా వస్తూ మస్తాన్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో మస్తాన్ అక్కడికక్కడే మృతిచెందాడు. సుబ్రమణ్యం, రాజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజయ్యను నెల్లూరుకు, సుబ్రమణ్యంను తిరుపతికి తీసుకెళ్లారు. మస్తాన్ మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

పది పరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో..

షేక్ మస్తాన్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మస్తాన్ చెన్నైకి వెళ్లి కూలి పనులు చేసుకుని భార్య పిల్లలను పోషించుకుంటున్నాడు. మృతుని కుమార్తె సార్య పదో తరగతి చదువుతోంది. మార్చిలో పది పరీక్షలు జరగనున్నాయి. తండ్రి చనిపోవడంతో ఆత్మస్థైర్యాన్ని కోల్పోయే పరిస్థితి నెలకొందని అతని బంధువులు బోరున విలపించడం చూపరులకు కన్నీళ్లు తెప్పించింది.

సమస్యల పరిష్కారానికే నిరాహార దీక్ష



రైల్వే కార్మికుల దీక్షా శిబిరంలో పాల్గొన్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్): సమస్యల పరిష్కారం కోసం రైల్వే కార్మికులు ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్ పిలుపు మేరకు తిరుపతి రేణిగుంట మార్గంలోని సీఆర్ఎస్ మెయిన్ గేట్ ఎదుట మంగళవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సీఆర్ఎస్‌లోని కార్మికులు సుమారు 200 మంది పాల్గొన్నారు. తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం నిరాహార దీక్ష శిబిరం వద్దకు చేరుకున్న కార్మికులకు సంఘీభావం తెలిపారు. అనంతరం కార్మికులు వారికి వినతి పత్రం సమర్పించారు.

డిమాండ్లు ఇవే

- 8 పే కమిషన్ వేతన సంఘం కమిటీని ప్రకటించి 2.86 రెట్లు పెంపుదల చేసి కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేయాలి. – పాత పెన్షన్ అమలు చేయాలని
- కోవిడ్ కాలంలో నిలిపివేసిన 18 నెలల డీఏ అరియర్స్‌ను విడుదల చేయాలి.
- ప్రతి మహిళా ఉద్యోగికి నెలకు మూడు రోజుల ప్రత్యేక సీఎల్ మంజూరు చేయాలి.
- ప్రైవేటీకరణను వెంటనే నిలుపుదల చేయాలి
- ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.
- వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న కార్మికులపై పడుతున్న పని ఒత్తిడిని తగ్గించాలి.

కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ కోశాధికారి మునికుమార్, యూనియన్ నాయకులు ముని రాదయ్య, హేంద్రి పాల్, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రనాయక్, తిలక్‌కుమార్‌రెడ్డి, గాండీవన్, దిలీప్‌కుమార్, నరేంద్ర, అరుణ్, సురేష్ పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు అండగా ఉంటాం

సి ఆర్ ఎస్ వద్ద రైల్వే కార్మికులు చేస్తున్న నిరాహార దీక్ష శిబిరానికి తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం చేరుకొని వారికి సంఘీభావం తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ రైల్వే కార్మికుల కోరుతున్నవి న్యాయపరమైన కోర్కెలని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్క కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. రైల్వే కార్మికుల సమస్యలను వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీగా రైల్వే బోర్డు అథారిటీ, రైల్వే శాఖ కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రైల్వే కార్మికుల డిమాండ్లు పరిష్కరించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రైల్వే కార్మికుల డిమాండ్లు న్యాయపరమైనదని తప్పకుండా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్మికులకు అండగా ఉంటామన్నారు. ఎంపీ గురుమూర్తి ద్వారా రైల్వే అథారిటీ చైర్మన్ దృష్టికి మీ సమస్యలను తీసుకొని వెళతామని తెలిపారు. ముఖ్యమైన యూనియన్ నాయకులను ఢిల్లీకి తీసుకొని వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

తిరుపతి అర్బన్: గత ఏడాది ఓ దాడి కేసులో మొదటి ముద్దాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుటుంబ వివాదాల నేపథ్యంలో గత ఏడాది సెప్టెంబర్ నెలలో చెన్నైకి చెందిన మెరీనాతో పాటు శ్రీరాములు, సింధు, కమలమ్మ అనే నలుగురు తిరుపతిలోని రాఘవేంద్రనగర్‌లో నివాసం ఉంటున్న బ్యూలాతోపాటు ఆమె తల్లి పూంగావనంపై దాడి చేశారు. అప్పట్లోనే కేసు నమోదు చేశామని తెలిపారు. మంగళవారం మొదటి ముద్దాయిగా ఉన్న మెరీనాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. మిగిలిన ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు



చంద్ర

నాయుడుపేట టౌన్: చలివేంద్రం గ్రామ సమీపంలో పత్రీజీ ధ్యాన ఆశ్రమంలో పనిచేస్తున్న చంద్రయ్య(50) సోమవారం ఆశ్రమంలో మృతి చెందాడు. దీనిపై పోలీసులు మంగళవారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేట పట్టణానికి చెందిన కనకట్ల బలరామయ్యకు చెందిన ధ్యాన ఆశ్రమంలో చంద్ర 8 నెలలుగా పని చేస్తున్నాడు. సోమవారం చంద్ర ఆరోగ్యం క్షీణించి మృతి చెందాడు. మృతుడి ఆచూకీ, అతని కుటుంబ సభ్యుల వివరాలు తెలియక పోవడంతో బలరామయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు చంద్రది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అతని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ కోసం విచారణ చేస్తున్నట్లు సీఐ బాబి తెలిపారు.

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. పదోతరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన డీఆర్వో నరసింహులు, డీఈఓ కేవీఎన్ కుమార్, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి ప్రభాకర్‌రెడ్డితో కలసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పదోతరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలుంటాయన్నారు. జిల్లాలో 28,656 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు వెల్లడించారు. పదోతరగతి ఓపెన్ స్కూల్స్‌లో 1,019 మంది విద్యార్థులకు మార్చి 17 నుంచి 28వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నట్టు చెప్పారు. అలాగే ఇంటర్మీడియెట్‌కు సంబంధించి మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు.. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. 2,838 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. డీపీఓ సుశీలాదేవి, డీఎంహెచ్ఓ బాలకృష్ణనాయక్, అదనపు తిరుపతి కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ గురుస్వామి రెడ్డి, ఆర్టీఓ మురళీకృష్ణ, పోలీస్, విద్యుత్‌శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

తప్పుల్లేకుండా ఆధార్ కార్డులు

ఆధార్‌కార్డుల నమోదుతోపాటు అప్డేషన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు వారిచే నిర్వహిస్తున్న 9 రకాల స్టేట్ హోల్డర్స్ ఆధార్ సెంటర్లల్లో ఆపరేటర్లకు ప్రతినెలా అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. జేఈఈ మెయిన్, నీట్ విద్యార్థులకు సంబంధించి ఆధార్ అంశాల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. డీఆర్వో నరసింహులు, డీపీఓ సుశీలాదేవి, డీఎల్‌డీఓ నారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డ్వామా పీడీ శ్రీనివాసరావు, ఎల్‌డీఎం విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ ఫెడరేషన్‌కు పలమనేరు పీడీ



ఫిజికల్ డైరెక్టర్ విక్రమ్‌రాజ్

పలమనేరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ విక్రమ్‌రాజ్ ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్‌కు ఎంపికయ్యారు. జిల్లా నుంచి ఈయన మాత్రమే ఎంపిక కాబడ్డారు. తనకు ఎంతో మద్దతిచ్చిన పలమనేరు ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీఎస్ నవీన్‌కుమార్, దిలీప్‌కుమార్‌లకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

Real Estate

HOUSE FOR SALE
44 Ankanams (Approximately) రెండు అంతస్తుల బిల్డింగ్ ఫర్ సేల్, రామానుజ సర్కిల్ దగ్గర, మెయిన్ రోడ్, Suitable for Guest House, Home Stay, Hostel. 98496 50503.

TOLET
తిరుపతి, అమరావతి నగర్, M.R.పల్లి సర్కిల్ దగ్గర 1st ఫ్లోర్, ఈస్ట్ ఫేస్ గల 2BHK హౌస్ (House) బాడుగకు ఇవ్వబడును. (Rent is Negotiable)24 Hrs Water. 9849321716.

TO-LET COMMERCIAL
4 Floors Building with Water facility. behind Passport Office. AIR Bypass Road, TIRUPATHI, Suitable for P.G. Hostel. Ph: 94400 83224, 95738 49671.

BUSINESS SERVICE



BUSINESS OFFER
మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి. లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 98430 10487, 8376089771, 011-25920179

Wanted

రాపిడో బైక్ టాక్సీ కెప్టెన్‌గా చేరండి. రోజు కు రూ.1,000/- వరకు సంపాదించండి. అవసరమైన Doc: RC, లైసెన్స్, Android మొబైల్, ఆధార్/Pan కార్డ్. 04048937617.

తిరుపతిలోని డెంటల్ క్లినిక్ నందు పని చేయుటకు Receptionist with Computer Knowledge కావలెను. సంప్రదించండి సెల్: 97044 12373.

కేర్‌టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు ఆంధ్ర హోమ్‌కేర్ ఆఫీస్‌కి కావలెను. మంచి జీతం+వ+భో. ✆ 91608 35559, 78158 35561

వీఐపీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు. ఫ్రీ రూం+భోజనం. HYD. 7995365999

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact 9705444178 9951602970

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించే ముందు సరైన పరిశీలన చేసుకోవలసిందిగా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారులు చేసే క్లెయిమ్‌లతో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.